క్లుప్తంగా

యార్డు అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్ : రాయచోటి యార్డు అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌ను రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. యార్డు ఆవరణలో ఫ్రూట్స్ మండీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు యార్డులోని ఇసుక డంపింగ్‌ను తొలగించి వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని కోరారు. రైతు బజారును త్వరలో తెరిపించి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అంతకుముందు కలెక్టర్‌ను దుశ్శాలువాతో సన్మానించారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని పల్లకీలో ఊరేగించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి, అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఉత్సవమూర్తులను పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ సుధాకరరెడ్డి

రాయచోటి టౌన్ : క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ నిలుస్తుందని రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్‌లకు సర్టిఫికెట్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరడం వలన మంచి క్రమశిక్షణతో పాటు దేహదారుఢ్యం వస్తుందన్నారు. దీంతో సైనికులుగా, విద్యావేత్తలుగా, భావిభారత పౌరులుగా ఉన్నతమైన మనుషులుగా ఎదుగుతారన్నారు. అనంతరం 'ఏ' సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

సిద్దవటం : సమ్మెటీవ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈనెల 4 నుంచి జరగనున్నట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్షల అనంతరం 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులుంటాయన్నారు. తిరిగి 17న పాఠశాలలు తెరుచుకోనున్నాయి.

నేడు పింఛన్ల పంపిణీ

పుల్లంపేట : నేడు మంగళవారం పింఛన్ల వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ చేతుల మీదుగా అర్హులకు అందజేయనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇష్టంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ఓబులవారిపల్లె : విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని రైల్వేకోడూరు సీఐ విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు యాల్లాపల్లె పంచాతీలోని చిన్మయ అరణ్యం ఆశ్రమంలోని విద్యార్థులకు సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి విద్యాసామగ్రిని అందజేశారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్మయ అరణ్యంలో ఆహ్లాదకరమైన వాతవరణంలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.

7న క్రికెట్ టోర్నమెంట్

రైల్వేకోడూరు : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ కేసీ అగ్రహారంలో ఈ నెల 7వ తేదీన కేసీ అగ్రహారం ప్రీమియర్ లీగ్ పేరున వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు సోమవారం ఆర్గనైజర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ ఎంట్రీ ఫీజుతో టీంలను నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు 7893656408 నంబర్ సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాసకాలనీకి చెందిన మానసిక దివ్యాంగులకు సోమవారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ముక్కా రూపానందరెడ్డి రెండు కుటుంబాలకు రూ. 1లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఉత్తర ద్వార దర్శనం..

సర్వపాప హరణం



ఒంటిమిట్ట: కోదండరాముడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



సిద్దవటం: కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



రాజంపేట రూరల్: గరుడవాహనంపై వేంకటేశ్వరుడు



రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరుడు



ఓబులవారిపల్లె: భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దశరథరాముడు ఉత్తర ద్వారం వద్ద గరుడ వాహనంపై భక్తులకు అభయమిచ్చాడు. ఈ సందర్భంగా రాముల వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువ జామున 4 గంటలకు కోవెల ఉత్తర గోపురం ద్వారాలకు శాస్త్రోతంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూల మూర్తులకు అర్చకులు పంచామృతాభిషేకాలు, అలంకరణలు, సహస్రనామార్చనలు చేసి, 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను మాఢ వీధుల్లో ఊరేగించారు. వివిధ జిల్లాల నుంచి స్వామి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరిటెండెంట్ వెంకటేశయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు పర్యావేక్షించారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

సౌమ్యనాథుని దర్శనార్థం పోటెత్తిన భక్తజనం

నందలూరు(రాజంపేట) : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని సౌమ్యనాథాలయానికి భక్తజనం పోటెత్తారు. టీటీడీ ముందస్తుగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సర్వంసిద్ధం చేసింది. ఈ సందర్భంగా స్వామిని సుందరంగా అలంకరించారు. ఉత్తర ద్వార గుండా స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు బారులుతీరారు. టీటీడీ డిప్యూటీ నటేష్‌బాబు ఆధ్వర్యంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజ్ నేతృత్వంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉత్తర ద్వార గుండా స్వామిని దర్శించుకున్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని గ్రామ గ్రామాన వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని రామాపురం రోడ్డు మార్గం సమీపంలో ఉన్న నామాలగుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వార ద్వారా స్వామివారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. చింతకుంటవాండ్ల పల్లెకు వెళ్లే మార్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

రామాపురం : పవిత్ర ముక్కోటి ఏకాదశి వేడుకలను సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలోని ఆలయాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. స్థానిక హరిహరాలయం, గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని అభయహస్త ఆంజనేయస్వామి ఆలయం, సోమరాయునపేటలో వెలసిన అభహస్త ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కనబడింది. కంభరాయుడిగుట్టలో వేంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : వైకుంఠ ఏకాదశిని సోమవారం మండలవ్యాప్తంగా ఉన్న వైష్ణవ ఆలయాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలను సుందరంగా అలంకరించారు. అనంతరం మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సుండుపల్లె వద్ద ఉన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, రామ్‌నగర్‌లోని తిరుమలగిరిపై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు తదితర ఆలయాల్లో భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేశారు.

వైకుంఠ ఏకాదశి పూజలు

చిన్నమండెం : మండలంలోని పలు ఆలయాలలో వైకుంఠ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను అందంగా అలంకరించి, భక్తాదులకు ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను చేశారు. పురాతనమైన దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డిలు హాజరయ్యారు.

పెనగలూరులో..

పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి పార్వేట స్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాయచోటిలోని వైష్ణవ ఆలయాలలో భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం ఉదయం నుంచి ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని మాసాపేటలోని వేంకటేశ్వరుడికి విశేష పూజలు చేశారు. స్వామివారిని అందంగా అలంకరించి వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించారు. అలాగే పట్టణంలోని గుండాంజనేయస్వామి ఆలయం, రామాలయం స్వామివార్లను అందంగా అలంకరణలు చేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అలాగే ఎస్ఎన్ కాలనీలోని బాలాజీ నగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుడి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : ముక్కోటి దేవతలారా దీవించండి అంటూ ప్రజలు పవిత్ర ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని సోమవారం ఘనంగా దేవతలకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు బారులుతీరారు. అలాగే శ్రీభుజంగేశ్వర స్వామి దేవస్థానం, అమ్మవారిశాల,



రాయచోటి టౌన్: దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కోదండ రామాలయం, సాయిబాబా ఆలయం, అయ్యప్ప ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్‌లోని కోదండ రామాలయంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సంకీర్తన ఆకట్టుకుంది. మూలవిరాట్‌లకు అర్చక స్వాములు ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని మాధవరం1, 2, 3 వార్డులలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా జరిపారు.

వెయ్యి మందికి అన్నదానం

ఓబులవారిపల్లె : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఓబులవారిపల్లె సర్పంచ్ ఎస్‌పీ జయపాల్‌రెడ్డి చంద్రగిరి మండలం అప్పలయకుంట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు. ఇందులో అరిగెల రమణ, కృష్ణయ్య ,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో...

సంబేపల్లె : మండల పరిధిలోని ఆడవికమ్మపల్లె గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

మతసామరస్యానికి ఉర్సు ఉత్సవాలు ప్రతీక



ఉర్సులో పాల్గొన్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : మతసామరస్యానికి ఉర్సు ఉత్సవాలు ప్రతీకలని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నందలూరు రైల్వేకేంద్రంలో నిర్వహించిన హజరత్ ఖాదర్‌వలీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నందలూరు, నందలూరు రైల్వేకేంద్రం, టంగుటూరులో ఉర్సు ఉత్సవాలల్లో హిందూ, ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటారన్నారు. ఉర్సు సందర్భంగా సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదికాలలపాటు కొనసాగాలని ప్రార్థించామన్నారు. జగనన్నకు అండగా ముస్లింలు వెన్నంటే ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, సర్పంచ్ సూర్యనారాయణ, ఏజీపీ షమీ, ఎస్ఐ మైనుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీడి సుధాకర్, హిమగిరి, మన్సూర్, నాగసుబ్బయ్య, తుమ్మల శ్రీధర్‌గౌడ్, ముమ్మడి మదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు పి.సుబ్రమణ్యం, స్వామి ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

సిద్దవటం : మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లోని పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి మండల స్థాయి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జగనన్న కాలనీల్లోని పక్కా గృహాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలానికి 1167 పక్కాగృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 169 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న మిగతా ఇళ్లను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జనవరి చివరి నాటికి 35 శాతం పన్నులు వసువులు గా లక్ష్యం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, ఎంఈఓ శంకరయ్య, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ జయచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : స్పందనకు వచ్చే అర్జీదారులకు ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్న కార్యక్రమం సోమవారానికి 5వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, దిన్నెపాడు రవిరాజు, కౌన్సిలర్లు జయన్న నాయక్, భాస్కర్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, గువ్వల బుజ్జిబాబు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే సీఎం ఆశయం

- అనర్హులు స్వచ్ఛందంగా పథకాలను వదులుకోవాలి
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : పేదరికం లేని సమాజమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వైఎస్సార్ పెన్షన్ కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక స్వావలంభన సాధించినప్పుడే పేదరికం లేని సమాజం సాధ్యం కాగలదని సీఎం గట్టిగా విశ్వసిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పింఛన్లను తొలగించారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. అనర్హులైన వారు ప్రభుత్వ పథకాలు పొందడం తప్పని తెలిపారు. అలాంటి వారు పథకాలను స్వచ్ఛందంగా వదులుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల ద్వారా ఒకటవ తేదీ ఉదయం ఆరు గంటలకే తలుపుతట్టి వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్‌ను అందిస్తున్నామన్నారు. వలంటీర్లు నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్నారని కీర్తించారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చేది కలే అన్నారు. ప్రజల ఆశీస్సులతో మరో ముప్పై ఏళ్ళు వైఎస్ జగన్ సీఎంగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. పబ్లిసిటీ పిచ్చి కారణంగా గతంలో గోదావరి పుష్కరాల సందర్భంగా దాదాపు 30 మందిని, ఇటీవల కాలంలో 11 మందిని చంద్రబాబునాయుడు నిండు ప్రాణాలను బలిగొన్నాడని ఆరోపించారు. దీంతో జనం ఈబాబు మాకొద్దుబాబు అంటున్నారని తెలిపారు. అలానే మండల పరిధిలోని లబ్ధిదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్‌లు రాము యాదవ్, శంషాద్‌బేగం, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి చిదానంద్‌గౌడ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, మునిసిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ బాలమునుస్వామి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: నూతనంగా పింఛన్‌దారులకు నగదును అందిస్తున్న ఎమ్మెల్యే మేడా, పోలా

సెల్ కనెక్టివిటి పెరగాలి

నందలూరు(రాజంపేట) : నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సెల్ కనెక్టివిటి పెరిగేలా తమవంతుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. అటవీ గ్రామమైన చింతలకుంటలో జియో టవర్‌ను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసారెడ్డి, వేణు, శంకర్‌రెడ్డి, యానాదిరెడ్డి, రామచంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, ఓర్సు శ్రీను, దళితనేత సత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సిద్దవటం : మాధవరంలోని వేంకటేశ్వరస్వామిని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఆయనకు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. స్థానిక సర్పంచ్ చేపూరి ఓబయ్య, ఆయనకు శాలువాకప్పి సన్మానించారు.

అర్హులకు పింఛన్ల అందజేతే ధ్యేయం

ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ జల్లా

గాలివీడు : రాష్ట్రంలో జగనన్న పాలనలో అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డిలు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 230 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో హరితవనం



మొక్కలు నాటుతున్న తహసీల్దార్, ఎస్ఐలు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో హరితవనం ఏర్పాటుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. వందలాది పలు రకాల మొక్కలను ఉచితంగా అందజేశారు. సోమవారం ఆలయ ఆవరణలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎస్ఐ షరీఫ్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మహిమాన్విత శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో వందలాది మొక్కలు నాటడం ద్వారా ఆలయం పచ్చని వాతావరణం నెలకొంటుందన్నారు. ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ ఐసీఐసీఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయం, ఆదర్శనీయమన్నారు.

8న గోదాదేవి కల్యాణం



ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న సమితి సభ్యులు

రాజంపేట : ఈనెల 8న రాజంపేట తోట కల్యాణ మండపంలో తిరుప్పావై భక్తసేవాసమితి ఆధ్వర్యంలో శ్రీగోదాదేవి, శ్రీమహాలక్ష్మిదేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు కల్యాణోత్సవ ఆహ్వానపత్రికలను నందలూరు సౌమ్యనాథాలయంలో తిరుప్పావై భక్తసేవాసమితి సభ్యులు విడుదల చేశారు.

రక్తదాన శిబిరానికి ప్రశంసా పత్రం

రాజంపేట టౌన్ : గత నెల డిసెంబర్ 21వ తేదీ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జగన్‌పై అభిమానంతో 167 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇందుకుగాను పోలా శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తూ కడప రిమ్స్‌కు చెందిన బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారులు ప్రశంసాపత్రాన్ని పంపారు. ఈప్రసంశా పత్రాన్ని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ పాలనేని వెంకటనాగేశ్వరరాజు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పోలాకు అందజేశారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమీషనర్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పోలా

మిగులు భూములను పేదలకు పంచాలి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ మిగులు భూములను వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, దళితులకు పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు క్రిష్ణప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీకేఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగ అభివృద్ధికి ఎంతో తోడ్పాటునిచ్చే కోనేరు రంగారావు భూకమిటీ సిఫారుసులను వెంటనే నవరత్నాల్లో చేర్చాలన్నారు. 8వ విడత భూ పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలంటూ కోరారు. జిల్లాలో కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న మిగులు భూములను అర్హత కలిగిన దళిత, గిరిజన, వ్యవసాయకూలీల కుటుంబాలకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవ ప్రసాద్, రైల్వేకోడూరు కార్యదర్శి చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సిద్దయ్య, కట్టయ్య, ఉమా, అనుసూయ, లక్ష్మిదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



రాయచోటి అర్బన్: డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ



ఓబులవారిపల్లె: క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కత్తి

ఓబులవారిపల్లె : ఎస్టీయూ క్యాలెండర్ డైరీని సోమవారం మంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ క్యాలెండర్ డైరీని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్రా కార్యదర్శి గడ్డం ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకులు రమణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో...

రాయచోటి అర్బన్ : రూటా క్యాలెండర్‌ను డీఈఓ రాఘవరెడ్డి సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. రూటా జిల్లా జనరల్ సెక్రటరీ సిబాతుర్‌రహిమాన్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అలీ, నేతలు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరణ

పెనగలూరు : మండల ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సోమవారం డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎంఈఓ జయవేలు ఈ క్యాలెండర్లను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు జీఓల పుస్తకం, డైరీ, క్యాలెండర్లను అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ ఎన్.గోపాలరెడ్డి, మాజీ కన్వీనర్ పుచ్చకాయల ఎల్లయ్య, రామకృష్ణ, యానాదయ్య, రాము, వి శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : పేదల వ్యవసాయ భూములు కబ్జా చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత మావులూరి విశ్వనాథ్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో బాధిత మహిళ శంషాద్‌తో కలసి కలెక్టర్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ గాలివీడుకు చెందిన షేక్ శంషాద్‌కు సర్వేనంబరు 475లో 75 సెంట్ల భూమి ఉందన్నారు. అదే విధంగా పక్కనే ఉన్న మరో 1.5 ఎకరాలు దాదాపుగా వారి కుటుంబీకుల అనుభవంలో ఉందంటూ తెలిపారు. ఇటీవల భూమితో ఎటువంటి సంబంధం లేని షేక్ అహమ్మద్, షేక్‌బాషా, జిలాన్‌బాషాలు కలసి భూమిని కాజేసేందుకు దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. సదరు వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆమేరకు వినతిపత్రం అందించారు.



బాధితురాలితో కలసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

మొదలైన సామాజిక తనిఖీ సర్వే

వీరబల్లి : మండల పరిధిలోని పలు గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం ఇంటింటికి వెళ్ళి సర్వే మొదలుపెట్టినట్లు ఎస్ఆర్‌పీ సూర్యచక్ర తెలిపారు. మండల వ్యాప్తంగా 2021-22 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి 12 మంది సీఆర్పీలు, 12 మంది వీఎస్పీలు గ్రామాలలోని ఇంటింటికి తిరిగి చేసిన పనులపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం వచ్చిన సమాచారాన్ని జనవరి 6న ఓపెన్ ఫారంలో వివరిస్తామన్నారు.

ప్రపంచానికి కొత్తపంథా నేర్పుతున్న భారత్

రాజంపేట టౌన్ : ప్రపంచానికి భారత్ కొత్త పంథాను నేర్పుతోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆ కళాశాల విద్యార్థులు నిర్వహించిన జీ 20 అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే ఆలోచనే జీ 20 లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు వాతావరణ మార్పులనే కాక, ప్రపంచంలో జరిగే పరిణామాలను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.